క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో బొత్స దంపతులు



కప్ప స్తంభం వద్ద బొత్స దంపతులు

సింహాచలం: రాష్ట్ర శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు మంగళవారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం బొత్స దంపతులకు వేద ఆశీర్వచనమిచ్చి, ప్రసాదం అందించారు.

- విశాఖపట్నం రీజనల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎస్.వి.ఆర్.మూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

రేపు దుర్గమాంబ జాతర

పరవాడ: కలపాక గ్రామ ప్రజల ఆరాధ్యదేవత శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగను ఈ నెల 13న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ బొండా కనకారావు తెలిపారు. గ్రామ పొలిమేరలో వెలసిన దుర్గమాంబ పండగ సందర్భంగా గురువారం వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. సాయంత్రం అమ్మవారిని డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం భారీ బాణసంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.

ఘనంగా మహిళా మండలి వార్షికోత్సవం



మహిళా మండలి సభ్యుల్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని మహిళా మండలి 30వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. పలు అంశాలపై కాలనీ పెద్దలు ఎమ్మెల్యేతో మాట్లాడారు. కార్పొరేటర్ శానాపతి వసంత, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా పోలిపల్లి పేరంటాలు తీర్థమహోత్సవం

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలో పోలిపల్లి పేరంటాలు తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించినవారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు మామిడి కొండాజీ, సేనాపతి దుర్గ అప్పారావు, బక్క సింహాచలం తదితరులు ఉన్నారు.

యువజన విభాగం అధ్యక్షుడిగా శ్రావణ్



సబ్బవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా తవ్వవానిపాలేనికి చెందిన బోకం శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకారం అందించిన నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

జాతీయ అబాకస్ పోటీలకు ఎంపిక



జాతీయ అబాకస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెందుర్తి: స్థానిక శారదా అబాకస్ విద్యా సంస్థలో తర్ఫీదు పొందుతున్న నలుగురు విద్యార్థులు జాతీయ అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జి.దీపాంజలి, హయగ్రీవ, హసిని, వినయశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు

పరవాడ: మండలంలోనినాయుడుపాలెం గ్రామ ప్రజలు కొంత కాలంగా లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో బోర్లపై ఆధారపడి పంటలు సాగుచేసే వ్యవసాయదారులకు సక్రమంగా విద్యుత్ సరఫరా జరగకపోవడంతో బోర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. గృహ విద్యుత్ ఉపకరణాలు కూడా సరిగా పనిచేయట్లేదు. ప్రస్తుత వేసవిలో రాత్రి సమయంలో లోఓల్టేజీ వలన ఏసీలు, ఫ్యాన్లకు అవసరమైన విద్యుత్ అందక ప్రజలు సతమతమవుతున్నారు. లో ఓల్టేజీ సమస్యను విద్యుత్ సిబ్బందికి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించట్లేదని, తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామ కూటమి నాయకుడు కూండ్రపు మధు ఓ ప్రకటనలో కోరారు.

అయినవారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్నట్లుంది పెందుర్తిలో జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తీరు. ప్రజారాజ్యం పార్టీలో ఆయన చేరినప్పటి నుంచి ఆయన వెన్నంటే నిలిచిన శ్రేణులు ఇప్పుడు అసంతృప్తితో రగిలిపోతున్నాయి. తాజా ఎన్నికల్లో పంచకర్లకు పెందుర్తి సీటు కేటాయింపును వ్యతిరేకించిన వర్గమే ఇప్పుడు ఆయనకు అన్నీ తామై వ్యవహరిస్తోంది. ఏళ్ల తరబడి ఆయన వెంట నడిచిన వారు కూడా వీరి ప్రాపకం కోసమే పాట్లు పడాల్సి రావడాన్ని సహించలేకపోతున్నారు. పార్టీ ఆత్మీయ సమావేశాల్లో తమ ఆవేదనను బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు.



జనసేన ఆత్మీయ సమావేశానికి హాజరైన కేడర్, మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

అప్పుడు కష్టపడి..

ఇప్పుడు కాళ్లావేళ్లా పడాలా?

- గతంలో పంచకర్ల రాకను అడ్డుకున్న వారికే నేడు అందలం
- ఏళ్ల తరబడి వెన్నంటి ఉన్నవారికి ఇబ్బందులు
- పంచకర్ల చుట్టూ శివశంకర్ కోటరీ
- జనసేన ఆత్మీయ సమావేశాల్లో నేతల ఆక్రోశం
- వేదిక మీద నుంచే ఎమ్మెల్యేను నిలదీస్తున్న వైనం

పెందుర్తి: 'ప్రజారాజ్యం నుంచీ మీ వెంట ఉన్నాం. మొన్నటి ఎన్నికల్లో మీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డాం. కానీ మిమ్మల్ని పెందుర్తి బరిలో నిలవకుండా అడ్డుకునేందుకు విశ్వప్రయత్నం చేసిన(పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ శివశంకర్ వర్గం) వారికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి మీ చుట్టూ పెట్టుకున్నారు.'అంటూ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును ఆ పార్టీ నాయకులు నిలదీస్తున్నారు. సోమవారం పెందుర్తిలో, మంగళవారం సబ్బవరంలో జరిగిన జనసేన ఆత్మీయ సమావేశాలు అత్యంత ఉద్రిక్తంగా.. ఆ పార్టీ పాతకాపుల అసంతృప్తుల మధ్య జరిగాయి. పార్టీ నాయకులకు వారి అభిప్రాయాలు వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వగా.. ఎమ్మెల్యే రమేష్‌బాబు చుట్టూ ఉన్న కోటరీపై తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు.

వాళ్లు చెప్తేనే.. చేస్తామంటే ఎలా?

నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా శివశంకర్ వర్గమే ఎమ్మెల్యే వెంట ఉంటోందని, ఏ అధికారి దగ్గరకు వెళ్లినా 'వారు'మాకు చెప్పలేదు.. మేం ఎలా చేస్తామని చెబుతున్నారని ఆక్రోశం వెళ్లగక్కారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, వేపగుంట ప్రాంతాల్లో వారి మాటే చెల్లుబాటు అవుతోందని, తమను కరివేపాకులా తీసి పారేస్తున్నారని వాపోయారు. మొన్నటి ఎన్నికల్లో రమేష్‌బాబుకు పెందుర్తి టికెట్ కేటాయింపును తీవ్రంగా వ్యతిరేకించిన ఇద్దరు ముగ్గురు వ్యక్తుల చెప్పు చేతల్లోనే ఎమ్మెల్యే పనితీరు ఉండటంపై సమావేశాల్లో బాహాటంగానే విరుచుకుపడుతున్నారు.

టీడీపీ, బీజేపీ వారికే పనులు

మరోవైపు శివశంకర్ వర్గీయులు దగ్గరుండి మరీ తీసుకువస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తల పనులను రమేష్‌బాబు చేస్తున్నారని, జనసేనను నమ్ముకుని ఉన్న తమను మాత్రం పట్టించుకోవట్లేదని వేదిక పైనుంచే ద్వితీయ శ్రేణి నాయకులు ఆరోపిస్తున్నారు. దీనికి సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ నాయకులు చప్పట్లు కొట్టిమరీ, వాస్తవమేనని వంతపాడటం గమనార్హం. ఇదే అంశంపై సోమవారం పెందుర్తిలో జరిగిన సమావేశంలో తీవ్రస్థాయిలో పార్టీ నాయకులు తమ అసంతృప్తి వెళ్లగక్కారు. ఆత్మీయ సమావేశాల్లో ఒక్కసారిగా కేడర్ తిరగబడుతుండడంతో ఏం చేయాలో పాలుపోక ఎమ్మెల్యే తలపట్టుకున్నట్లు తెలుస్తోంది. బయటకు మాత్రం 'మీలో అసంతృప్తి ఉన్న మాట వాస్తవం.. కానీ నేను మీకున్నాను. మిమ్మల్ని బాగా చూసుకుంటాను'అని పంచకర్ల అసంతృప్త కేడర్‌కు వెన్న పూస్తున్నట్లు పార్టీ నాయకులు చెప్తున్నారు.

మీరే మమ్మల్ని తొక్కేస్తే ఎలా?

వాస్తవానికి పెందుర్తి జనసేన టికెట్ విషయంలో ఎమ్మెల్యే పంచకర్లకు, ఆ పార్టీ సీనియర్ నాయకుడు శివశంకర్‌కు మధ్య తీవ్రస్థాయిలో పోటీ నడిచింది. ఆ సమయంలో చినముషిడివాడకు చెందిన ఓ నాయకుడు(ప్రస్తుతం ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడు), వేపగుంటకు చెందిన ఓ నాయకురాలితో పాటు కొందరు శివశంకర్ వర్గీయులు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు ముందే పంచకర్లకు టికెట్ ఇస్తే ఒప్పుకోమని తెగేసి చెప్పారు. ప్రస్తుతం పంచకర్లకు సన్నిహితంగా ఉన్న శివశంకర్ వర్గీయులు తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. అప్పటి శివశంకర్ వర్గీయులే ప్రస్తుతం ఎమ్మెల్యేకు 'అన్నీ తామై'చూస్తున్నారని జనసేన సీనియర్లు చెబుతున్నారు. రమేష్‌బాబు కూడా వారికే అత్యంత ప్రాధాన్యత ఇచ్చి తమను 'తొక్కేస్తున్నారని'ఆరోపిస్తున్నారు.

మర్యాదపూర్వక భేటీ



వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం భేటీ అయ్యారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ కార్యకలాపాల గురించి వివరించారు. పలు అంశాలపై చర్చించారు.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవి కలిశారు. నియోజకవర్గంలో కూటమి నాయకులు దాష్టీకాలను వివరించారు.



వైఎస్ జగన్‌ను కలిసిన గండి రవి

మాఘపౌర్ణమి జాతరకు వేళాయె



విద్యుత్ లైట్లతో ముస్తాబైన మాధవస్వామి ఆలయం



మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక గదులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- పుణ్య స్నానాలకు ముత్యాలమ్మపాలెం తీరంలో ఏర్పాట్లు
- అందంగా ముస్తాబైన మాధవస్వామి ఆలయం

పరవాడ: మాఘపౌర్ణమి జాతరకు ముత్యాలమ్మపాలెం తీరం ముస్తాబైంది. తీరంలో వెలసిన మాధవస్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అలంకరించారు. గ్రామ కూడలి నుంచి తీరం వైపు వెళ్లే రహదారికి ఇరువైపుల విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. తీరంలో రాత్రంతా జాగరణ చేసిన భక్తులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలిరానున్న వేలాది మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బుధవారం సూర్యోదయాన తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మాధవస్వామిని దర్శించుకోవడానికి వీలుగా సర్వం సిద్ధం చేశారు. పుణ్యస్నానాలు ఆచరించే మహిళలు దుస్తులు మార్చుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. స్నాన ఘట్టాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుస్తుగా గజ ఈతగాళ్లను నియమించారు. మంగళవారం రాత్రికి భక్తుల సౌకర్యార్థం తీరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సూరాడ సోమునాయుడు చెప్పారు. మాఘపౌర్ణమి జాతరలో చేసిన ఏర్పాట్లను మంగళవారం పరవాడ తహసీల్దారు ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో ధర్మారావు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావులు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను సూచించారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తీరంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ నియంత్రణకు అదనపు పోలీసు బలగాలను నియమిస్తున్నామని సీఐ తెలిపారు. భక్తులను చేరవేయడానికి కూర్మన్నపాలెం స్టీల్ డిపో నుంచి అదనపు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ పేర్కొన్నారు.

వైభవంగా మర్లమాంబ పరస



పెందుర్తి: పులగానిపాలెం, జుత్తాడలో వెలసిన ఏడు ఊళ్ల గ్రామదేవత మర్లమాంబ పరస మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు-కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెటగుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆటలతో పిల్లలు సందడి చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ బొడ్డు చంద్రవతి ప్రకాష్, జుత్తాడ, దువ్వపాలెం, ఎస్ఆర్ పురం, పులగానిపాలెం, పెందుర్తి ప్రాంతాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

రెవెన్యూ రికార్డుల్లో పేర్ల తొలగింపుపై విచారణ



బాధిత రైతుల రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, అధికారులు

- తవ్వవానిపాలెం రైతుల ఫిర్యాదుపై తహసీల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన
- సమగ్ర విచారణ చేపట్టి బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో పలువురు రైతుల పేర్లను రెవెన్యూ రికార్డుల నుంచి అక్రమంగా తొలగించారన్న ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఇటీవల తవ్వవానిపాలెంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు బాధిత రైతులు వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్‌తో పాటు మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, మిగిలిన రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని, క్షేత్ర పరిశీలన జరిపారు. రెవెన్యూ రికార్డుల నుంచి పేర్లు తొలిగించిన రైతులు 109 మంది వరకూ ఉంటారని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ భూమిని తప్పుడు రికార్డులతో కొంత మంది రిజిస్ట్రేషన్లు చేయించుకుని క్రయ విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. రైతుల వద్ద ఉన్న అన్ని రకాల హక్కు పత్రాలైన పాత 1బి, అడంగల్ కాపీలు, డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో పాటు బాధిత రైతులు మాట్లాడుతూ అమృతపురం సర్వే నెం.423/10లో 41.70 ఎకరాల భూమి విజయనగరం సంస్థానానికి చెందిన రాజావారి వేలం పాటలో 1943లో నూతక్క కొండలరాయుడు అనే వ్యక్తి దక్కించుకున్నట్లు తెలిపారు. ఆయన వద్ద నుంచి 1951లో నాగళ్ల వెంకటరామయ్య కొనుగోలు చేయగా, అతడి నుంచి అదే భూమిని 1960లో గరిమెళ్ల మురళీతో పాటు మరో నలుగురు వ్యక్తులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి 1982లో తవ్వవానిపాలేనికి చెందిన సుమారు 40 మంది వరకూ రైతులు కొనుక్కుని, రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసుకుని సాగుచేసుకుంటున్నారని తహసీల్దార్‌కు వివరించారు. అయితే 2006లో కొందరు తప్పుడు రికార్డులు సృష్టించి, అప్పటి రెవెన్యూ ఉద్యోగి సహకారంతో 1బి నుంచి రైతుల పేర్లు తొలగించినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడంతో క్రయ విక్రయాలతో పాటు, ప్రభుత్వం రైతులకు అందించే ప్రోత్సాహకాలకు కూడా దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో అనేక పర్యాయాలు చేసిన ఫిర్యాదులు, వినతి పత్రాలు, విచారణ నివేదికలను తహసీల్దార్‌కు అందించారు.

దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, సాగులో ఉన్న రైతులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ బోకం అర్జునుడు, ఆర్ఐ వీరయ్యతో పాటు గ్రామంలోని పలువురు బాధిత రైతులు ఉన్నారు.



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన రైతుల సాగులో ఉన్న భూమి

నేడు శివశివానీ, ఆదిశంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: మండలంలోని సరిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శివ శివానీ సహిత ఆది శంకరాచార్యుల ప్రతిమ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. ధాన్యాధివాసం, గ్రామోత్సవ ఆరాధన జరిగాయి. సువాసిని పూజ ఘనంగా జరిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు శివ శివానీ సహిత శంకరాచార్య ప్రతిమ, యంత్ర ప్రతిష్టా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాల్సిందిగా కోరారు.

ఆదర్శ్‌లో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం



మాట్లాడుతున్న థియోఫిలాస్

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ మాట్లాడుతూ ఇంటర్నెట్ వాడకంలో యువత తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మహా మాఘి ఉత్సవాలు



పుణ్య నదీ జలాలను కలశాలలో నింపుతున్న దేశ, విదేశీ భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో బుధవారం నుంచి నిర్వహించే మహా మాఘి ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు గురుమాత అన్నపూర్ణాదేవి తెలిపారు. పవిత్ర గంగానదీ జలాలతో పాటు, ఇతర నదీ జలాలు, పంచ పల్లవాలతో మంత్రీకరించిన కలశ స్థాపన ప్రక్రియను పూర్తిచేశారు. ఇటీవల దేవీపురం నుంచి దేశ విదేశాలకు చెందిన భక్తుల బృందం మహాకుంభమేళా పవిత్ర స్నానాలకు ప్రయాగ వెళ్లి తీసుకొచ్చిన జలాలను వేదమంత్రోచ్ఛరణల నడుమ కలశాలలో నింపినట్లు పేర్కొన్నారు. వీటితో బుధవారం ఉదయం 6 గంటల నుంచి సహస్రాక్షి అమ్మవారికి, 9 నుంచి ఉత్సవ మూర్తులతో సహా ఖడ్గమాల మూర్తులకు ఏకకాలంలో సుగంధ జల సహిత పంచామృతాభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు.

మత్తుకు బానిసలు కావొద్దు

పరవాడ: మత్తు పదార్థాలు, వ్యసనాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు హితవుపలికారు. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం-పరిణామాలపై కాలనీ వాసులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు గంజాయి, దొంగతనాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మత్తు వ్యసనాల దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పద్మావతి, మాణిక్యం, మహిళలు పాల్గొన్నారు.

85 మందికి స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



పెందుర్తి: నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెందుర్తి పాతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు అందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్వప్నరెడ్డి చేతుల మీదుగా మొత్తం 85 మందికి కిట్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం ఎం.కిరణ్మయి, ఎస్ఎంసీ చైర్మన్ రాపేటి గణేష్, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాస్, రాజు, కిరణ్, మాధురి, శారద, బాలమ్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో ఘనంగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవ పట్టాలు అందుకున్న చిన్నారులతో సిబ్బంది

పెందుర్తి: స్థానిక భాష్యం పాఠశాలలో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.వి.దీపిక చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం టెస్సీ, గుంటూరు ఇందిర, జోనల్ ఈవో వెంకట్ తదితరులు పాల్గొన్నారు.